క్లుప్తంగా

సిర్పూర్(టి) ఎస్సైగా కమలాకర్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై కమలాకర్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల నూతన ఎస్సైగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కమలాకర్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తామని, మండల ప్రజలు సహకరించాలని కోరారు.

మహిళలకు రక్షణగా షీటీం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: మహిళకు అండగా షీ టీం పని చేస్తుందని షీ టీం సభ్యురాలు సునీత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంకు గురైతే వెంటనే షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు శ్రీనివాస్, రమాదేవి, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ రికార్డులు పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న చిరంజీవి

రెబ్బెన: సీఎంపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి.చిరంజీవి శనివారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియాలోని కైరిగూడ ఓసీపీ వద్ద కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ రికార్డులు పరిశీలించారు. ఏరియా సింగరేణి అధికారులకు సీఎంపీఎఫ్ -ఈ దరఖాస్తు పోర్టల్‌పై వివరించారు. ఉద్యోగులకు సంబంధించిన సీఎంపీఎఫ్ వివరాలను ఇకపై సీఎంపీఎఫ్ -ఈ పోర్టల్‌లో సులువుగా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలో శనివారం గుడుంబా స్థావరాలపై దాడి చేసినట్లు ఎస్సై కందూరి రాజు తెలిపారు. దాడుల్లో 200 లీటర్ల బెల్లం పానకం, పది లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నాటుసారా తయారు చేస్తున్న రెడ్డి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో కానిస్టేబుల్ రాజ్‌కిరణ్, మల్లేశ్ పాల్గొన్నారు.

కౌటాల ఎంఈవోగా రమేశ్

కౌటాల: కౌటాల మండల ఇన్‌చార్జి ఎంఈవోగా తోట రమేశ్ శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మెరుగైన విద్య అందించడానికి కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. కౌటాల నుంచి ఆదిలాబాద్ ఎంఈవోగా బదిలీపై వెళ్లిన సోమయ్యను ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు ఏటుకూరి శ్రీనివాసరావు, మడావి హన్మంతు, రాకేశ్, ఎంఎల్ రాజు, రమేశ్, హెచ్‌ఎంలు నానాజీ, అరుణ్‌కుమార్, జయరాజు, నారాయణ్‌సింగ్, హన్మంతు, తిరుపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కెరమెరి: పిడుగుపాటుతో మృతి చెందిన మండల కేంద్రంలోని బారేవాడకు చెందిన చౌదరి రమేశ్ కుటుంబానికి శనివారం మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగూరే శ్యాంరావు రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. సోనేరావు, సుభాశ్, రాజు, ప్రకాశ్, విజయ్, నాగు, సకారాం, రాము, వెంకట్‌రావు, బాపురావు, దేవాజి తదితరులు ఉన్నారు.

పాత పీహెచ్‌సీలో చోరీ

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని భవనాల కిటికీలు, తలుపులను దొంగలు చోరీ చేసినట్లు కౌటాల పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ శనివారం తెలిపారు. స్థానిక పాత పీహెచ్‌సీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, గుర్తు తెలియని వ్యక్తులు రూ.వేలల్లో విలువ గల పాత సామగ్రి దొంగిలించినట్లు తెలిపారు. పాత సామగ్రి దొంగతనం జరిగినట్లు కౌటాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

రాఖీ సందడి..!

సోదరసోదరీమణుల అనుబంధానికి ప్రతీక రాఖీ. సోమవారం రాఖీ పండుగ కావడంతో శనివారం జిల్లాకేంద్రంలో రాఖీ సందడి నెలకొంది. అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు పెద్ద ఎత్తున యువతులు, మహిళలు రాఖీలు కొనుగోలు చేశారు. పండుగ నేపథ్యంలో తీరొక్క రాఖీలతో పదుల సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. - ఆసిఫాబాద్‌రూరల్






కళాశాలలో రాఖీ వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సరస్వతి శిశు మందిర్‌లో శనివారం రాఖీ వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌కి, జిల్లా కలెక్టరేట్ అధికారులకు, పోలీసు కానిస్టేబుళ్లకు, ఆసుపత్రిలో యువతకు, వ్యాపారస్తులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బీసీ యువజన సంఘం అధ్యక్షుడు ప్రణయ్‌కు రాఖీ కడుతున్న విద్యార్థులు

సమగ్రశిక్ష ఉద్యోగ కమిటీ ఎన్నిక

కౌటాల: కౌటాల మండల సమగ్రశిక్ష ఉద్యోగుల కార్యవర్గాన్ని శనివారం మండల కేంద్రంలోని బాలికల కస్తూర్బా గాంధీ పాఠశాల ఆవరణలో ఎన్నుకున్నారు. కమిటీ మండల గౌరవ అధ్యక్షులుగా శిరీష, అధ్యక్షులుగా పవిత్ర, ఉపాధ్యక్షులుగా బులాజీ, ప్రధాన కార్యదర్శులుగా దేవన్న, లాలాజీ, సహాయ కార్యదర్శిగా విజయ, కోశాధికారిగా భువనేశ్వరి, సంయుక్త కార్యదర్శిగా ప్రకాశ్, మీడియా ప్రతినిధి కామ్రె సుమన్, సలహాదారులుగా కృష్ణవేణి, సరిత, సంధ్యారాణి, రాజామణి, కల్యాణి, సౌందర్య, కార్యవర్గ సభ్యులు సంగీత, ధనలక్ష్మి, శంకరమ్మ, సంగీత, నిర్మల, విజయ, బానయ్యను ఎన్నుకున్నారు. ప్రభుత్వం సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు అరికట్టాలి

రెబ్బెన: బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులు, హత్యలు, హింసాకాండకు నిరసనగా శనివారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మండల బంద్ విజయవంతమైంది. అన్ని వర్తక వ్యాపార సముదాయాలు, పాఠశాలలు, ప్రైవేటు వాహనాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు గోలేం తిరుపతి, శ్రీధర్, గోగర్ల రాజేశ్, లోకేష్ వెంకటేష్, నవీన్‌గౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోలేటిలో కొవ్వొత్తుల ర్యాలీ

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాకాండకు నిరసనగా శనివారం రాత్రి మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయిన హిందువుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించారు. కార్యక్రమంలో కడతల మల్లయ్య, సుధాకర్, సత్యనారాయణ, సంజీవ్, దిలీప్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సంతోష్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


రెబ్బెనలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా పెంచికల్‌పేట్ మండలంలో శనివారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వంతెనలు లేక అవస్థలు


నాటు పడవతో వాగు దాటుతున్న గుండి గ్రామ ప్రజలు

- రాకపోకలకు ఇబ్బందులు
- వాగులో కొట్టుకుపోతున్న ప్రాణాలు
- చర్యలు చేపట్టాలని ప్రజల వేడుకోలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మార్గంలోని వాగులపై వంతెనలు లేక వర్షాకాలంలో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కనీసం 108 అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితులు ఆయా గ్రామాల్లో నెలకొన్నాయి. దీంతో వాగులు దాటలేక అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వాగులు ఉప్పొంగినప్పుడల్లా ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. అధికారులు స్పందించి వాగులపై వంతెనలు నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు.

వాగు కష్టాలు ఉన్న గ్రామాలు..

- మండలంలోని గుండి గ్రామం జిల్లా కేంద్రానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. వాగుపై వంతెన లేక ఏటా వర్షాకాలంలో వాగు ఉప్పొంగినప్పుడల్లా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నాటు పడవల్లో ప్రజలు వాగు దాటుతున్నారు. వంతెన నిర్మాణం కోసం 2006లో శంకుస్థాపన చేసి పిల్లర్ దశ వరకు పనులు చేసి నిలిపివేశారు.
- వెంకటాపూర్ జీపీ పరిధిలో టిమ్రాన్ మోవాడ్, బండగూడ, టొక్కిగూడ గ్రామాలకు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే. ఈ మూడు గ్రామాల్లో 50 కుటుంబాలు, 180 మంది జనాభా వరకు ఉంది. వర్షాకాలం వచ్చిందంటే ఆయా గిరిజన గ్రామాలకు కాలినడకే శరణ్యం. గత ఏడాది వాగు దాటికి యువతి కొట్టుకుపోగా, ఇటీవల వాగు దాటుతూ గర్భిణీ ప్రసవించగా శిశువు మృతిచెందింది.
- మండలంలోని నీమ్‌గూడ, సమతుగుండం గిరిజన గ్రామాలకు వాగు ఉప్పొంగినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- తుంపెల్లి వాగుపై వంతెన ఉన్నా భారీ వర్షం కురిస్తే వంతెనపై నుంచి నీరు పారుతోంది. దీంతో సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- అప్పపల్లి, మోతుగూడ గ్రామాల మధ్యలో ఉన్న వాగుపై వంతెన నిర్మాణం కోసం రూ.1.80 లక్షలతో పనులు ప్రారంభించారు. కానీ పనులు పునాదుల వరకే పరిమితమయ్యాయి.

వాగు దాటడం కష్టం

వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆ సమయంలో వాగు దాటడం చాలా కష్టంగా ఉంటుంది. గత ఏడాది వాగు దాటుతూ ఒక యువతి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. అధికారులు మా కష్టాలను గుర్తించి వాగుపై వంతెన నిర్మించాలి.

- వెడ్మ రాము, టొక్కిగూడ

పనులు ప్రారంభించాలి

వాగుపై ఉన్న తాత్కాలిక వంతెనను తొలగించి కొత్త వంతెన పనులు ప్రారంభించారు. కానీ పనులను పునాది దశలోనే నిలిపివేశారు. దీంతో వానాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పనులు ప్రారంభించాలి.

- సాంబయ్య, అప్పపల్లి

ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకతపై శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియాలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం శ్రీనివాస్ ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యంతో పాటు సాధించిన ఉత్పత్తి వివరాలను తెలుసుకున్నారు. అలాగే ఏరియాలో నూతనంగా ప్రారంభించనున్న గోలేటి ఓసీపీకి సంబంధించిన అనుమతుల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కైరిగూడ ఓసీపీ నుంచి మందమర్రి ఏరియా కేకే 5 గని మేనేజర్‌గా బదిలీపై వెళ్తున్న ప్రవీణ్ ఫాటింగ్‌ను ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి ఎస్‌వోటూజీఎం ఉమాకాంత్, కైరిగూడ పీవో నరేందర్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సన్మానం

బదిలీపై మందమర్రి ఏరియాకు వెళ్తున్న ప్రవీణ్ ఫాటింగ్‌ను శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఓసీపీ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

జీఎంను కలిసిన రామచంద్ర మిషన్ అభ్యాసకులు

బెల్లంపల్లి ఏరియా నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన ఎం.శ్రీనివాస్‌ను శనివారం గోలేటిలోని శ్రీ రామచంద్ర మిషన్ ధ్యాన కేంద్రం అభ్యాసకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జీఎంకు పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, అభ్యాసకులు గోపాలక్రిష్ణ, మహేందర్‌రెడ్డి, రాంబాబు, ఓరం కిరణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూలు

రెబ్బెన: సింగరేణిలో ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులకు శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏరియాలో నలుగురు ఉద్యోగులు కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు హాజరైన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి ధ్రువపత్రాలు పరిశీలించి బెనిఫిట్స్‌పై అవగాహన కల్పించారు. డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

పులి కోసం వెతుకులాట

కెరమెరి: అటవీ అధికారులు పులిజాడ కోసం శనివారం కూడా వెతుకులాట కొనసాగించారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు అంతాపూర్ అడవుల్లో జల్లెడ పట్టినప్పటికీ ఎలాంటి ఆనవాలు లభించలేదు. గడిచిన కొంత కాలంగా పడమర ప్రాంతంలో అనేక గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది పులి? చిరుతపులి? అనే విషయం ఇంకా తేలలేదని ఎఫ్‌ఆర్‌వో సయ్యద్ మజారొద్దీన్ తెలిపారు. అటవీ అధికారులు రామయ్య, నజీర్‌అలీ, సిబ్బంది కైలాస్, గౌసుద్దిన్ తదితరులు ఉన్నారు.


కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

రాఖీ కట్టి.. అభిమానం చాటి


కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు రాఖీ కడుతున్న చిన్నారి


దీపక్ తివారికి రాఖీ కడుతున్న చిన్నారి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని పలువురు చిన్నారులు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారికి రాఖీలు కట్టి అభిమానం చాటుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పౌర్ణమి ప్రతీక అన్నారు. అనంతరం చిన్నారులు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులకు రాఖీలు కట్టారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

జైనూర్: పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిని హతమార్చిన దుండగులను గుర్తించి వెంటనే ఉరితీయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు, మండల వైద్యాధికారి నాగర్‌గోజే అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ర్యాలీ చేసి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మనిషి ప్రాణాన్ని కాపాడే వైద్యులకు దేశంలో భద్రత కరువైందన్నారు. వైద్యుల చట్టాలను ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు హైదర్, సాజేదా హైదర్, వైద్య సిబ్బంది మొబిన్, 108 పైలెట్ లటపటే ఉద్దవ్, ఆదివాసీ సంఘాల నాయకులు ఆత్రం భీంరావ్, కనక రాంజీ, శివరాజ్ పాటిల్ షిండే, అశోక్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.


కాగజ్‌నగర్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: కోల్‌కత్తాలోని మెడికల్ కళాశాలలో మహిళా వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చౌక్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన పట్టణంలోని పలు వీధుల గుండా కొనసాగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ మహిళా వైద్యురాలిని అత్యాచారం చేసి హత్యచేయడం దారుణమన్నారు. నిందితులను పట్టుకోవడంలో స్థానిక పోలీస్ యంత్రాంగం విఫలమైందన్నారు. పట్టణ వైద్యులు ముందాడ, రమాకాంత్, కృష్ణారావు, దశరథం, కృష్ణమూర్తి, విద్యాసాగర్, హసీబ్ ఉల్‌హక్, సాయి వివేక్, సుదీప్, హర్షవర్ధన్, శ్రావణ్‌కుమార్, అజర్ హుస్సేన్, నవ్యశ్రీ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు పాల్గొని మద్దతు తెలిపారు.

క్యాండిల్‌ర్యాలీ

కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఘటనను నిరసిస్తూ శనివారం రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నల్లని మాస్కులు ధరించి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ పలు వీధుల గుండా కొనసాగింది. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వలుపదాసు శ్రీదేవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, వెంకటేశం, పోచయ్య, విజయ్‌సింగ్, అశోక్ పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్‌పై జరిగిన ఘటన నేపథ్యంలో శనివారం ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల బంద్‌కు ఇచ్చిన పిలుపే మండలంలో విజయవంతమైంది. ఉదయాన్నే ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం మండలాధ్యక్షుడు మండలంలోని అన్ని ఆస్పత్రులను మూయించేశారు. ప్రైవేటు వైద్యులు వైరాగడే పాలక్‌రావు, చోలే సుధాకర్, ఝాడే సుధాకర్, బిస్వాస్, జమీర్, ముండే మాధవ్ ఉన్నారు.

సిర్పూర్(టి): కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన ఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తమ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు అత్యవసర వైద్యసేవలు మినహాయించి ఓపీ సేవలు నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వైద్యుడు జోగేందర్, హెడ్‌నర్స్ శ్రీదేవి, సులోచన, ఎలిజబెత్‌రాణి, విక్టెర్లా, కోమరజాను తదితరులు పాల్గొన్నారు.


జైనూర్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


మౌనప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు


కెరమెరి: ప్రైవేటు ఆస్పత్రిని మూయిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

ఆసిఫాబాద్ ఏవోగా మిలింద్ కుమార్

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండల ఏవోగా శనివారం మిలింద్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. మిలింద్ కుమార్ గతంలో వాంకిడి ఏవోగా పని చేసి బదిలీపై ఆసిఫాబాద్‌కు వచ్చారు. ఏఈవోలు ఏవోను శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఏఈవోలు చిరంజీవి, రహెమాన్, రాము, స్రవంతి పాల్గొన్నారు. కాగా బాబాపూర్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిగా వెంకటేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రతీ ఇంటిలో రీడింగ్ కార్నర్ ఏర్పాటు చేయాలి

రెబ్బెన: ప్రతీ ఇంటిలో విద్యార్థుల కోసం రీడింగ్ కార్నర్ ఏర్పాటు చేయాలని మన్నెగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోల మహేశ్ అన్నారు. శనివారం పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రగతికి సంబంధించిన వివరాలను తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థికి సరిపడా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లతో కూడిన కిట్‌ను స్థానిక యువత అందజేశారు.

ఆకట్టుకునేలా రూం టు రీడ్ పుస్తకాలు

కెరమెరి: రూం టు రీడ్ పుస్తకాలు విద్యార్థులను ఆకట్టుకునేలా ఉన్నాయని, ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని రూం టు రీడ్ జిల్లా అధికారి జెన్నీఫర్ రాణి అన్నారు. శనివారం మండలంలోని ఝరి పాఠశాల విద్యార్థులకు వికాసం 1, 2 పుస్తకాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు సులువైన పద్ధతిలో అర్థవంతంగా ఉండే భాషతో పాటు రంగు రంగుల బొమ్మలు కలిగిన పుస్తకాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, మండల సమన్వయకర్త రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అవినీతిలేకుండా 'కల్యాణలక్ష్మి' అమలు

చింతలమానెపల్లి: అవినీతికి అవకాశం లేకుండా కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్నామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శనివారం మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ నిర్వహించారు. 46 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే హరీశ్‌బాబు చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఆర్‌ఐలు విజయ్‌కుమార్, జాఫర్, బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీశైలం పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలి

రెబ్బెన: రెబ్బెన పీఏసీఎస్ ద్వారా సహకార బ్యాంకులో రుణాల మంజూరులో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బాధిత రైతులు డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లావుడ్య రమేశ్, దేవాజీ, చిరంజీవిగౌడ్, దుర్గం సోమయ్య, చెన్న సోమశేఖర్, గంటుమేర, అవిడపు గోపి, శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నాయకులు బాలక్రిష్ణ, నవీన్‌గౌడ్ ఏఐటీయూసీ నాయకులు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ : తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899